భూ సమస్యలకు చెక్

- సమస్య పరిష్కారానికి 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు– భూరక్ష' అమలు
- సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తున్న అధికారులు
- చివరగా హక్కు పత్రం అందజేత

కౌతాళం: భూ సమస్యలతో ఏళ్లుగా సతమతమవుతున్న రైతులకు ప్రభుత్వం పరిష్కారం చూపాలని నిర్ణయించి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు– భూరక్ష పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. గ్రామాలను యూనిట్‌గా తీసుకొని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సర్వే చేసి హద్దులు నిర్ణయించి రైతుల సమక్షంలో కొలతలు వేసి హద్దు రాళ్లు పాతుతున్నారు. దీంతో అపరిష్కృతంగా ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తోంది. వందల సంవత్సరాల నుంచి వివాదాస్పదంగా మారిన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నారు. ఈ పథకం వల్ల రైతులకు డ్రోన్ ద్వారా ఉచిత సర్వేతో పాటు పొలాల హద్దులు చూపించడం, హద్దుల వద్ద రాళ్లను కూడా ప్రభుత్వమే వేస్తుంది. మండలంలోని 36 గ్రామాల్లో మొత్తం 73,458 ఎకరాల భూమి ఉంది.ఇందుకు 31,173 ది రైతులు ఉన్నారు. ఇప్పటి వరకు 6 మాల్లో సర్వే పూర్తి కాగా..సంబంధిత రైతులకు పట్టాపాస్ పుస్తకాలు అందజేశారు. లింగాలదిన్నె గ్రామంలో 1,284 ఎకరాలకు గాను 310 మంది రైతులు ఉన్నారు, వీరాలదిన్నె గ్రామంలో 878 ఎకరాలకు గాను 309 మంది రైతులు ఉన్నారు. మదిర గ్రామంలో 366 ఎకరాలకుగాను 173మంది రైతులు ఉన్నారు. గుర్రాలదొడ్డిలో 290 ఎకరాలకు గాను వంద మంది రైతులు ఉన్నారు. అలాగే గోతులదొడ్డిలో 575 ఎకరాలకు గాను 147మంది రైతులు ఉన్నారు. ఆయా గ్రామాల్లో సర్వే పూర్తి చేసి పొలాలకు హద్దులు చూపడంతో పాటు అందుకు సంబంధించి వారికి మ్యాప్ ఇచ్చారు. అలాగే పొలాల హద్దుల వద్ద ప్రభుత్వమే రాళ్లను ఏర్పాటు చేశారు. దీనికి తోడు చుక్క భూములకు, క్లైమ్ కాని విస్తీర్ణం భూములకు కూడా పరిష్కారం దొరికిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన గ్రామాల్లో డ్రోన్ సర్వేను ప్రారంభిస్తామని తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి తెలిపారు.


రైతుల సమక్షంలో హద్దు రాళ్లు పాతుతున్న దృశ్యం


సర్వే చేస్తున్న దృశ్యం

➡ గోతులదొడ్డికి చెందిన రైతు వడ్డె రామన్న కర్ణాటక రాష్ట్రం శిరుగుప్పలో ఉంటాడు. గ్రామంలో ఈయనకు ఎకరా పొలం ఉంది. సరిహద్దు సమస్యతో ఏడేళ్లుగా ఇబ్బంది పడుతున్నాడు. దీంతో సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని ఏడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా లాభం లేకపోయింది. అయితే ఈ పథకం కింద ఉచితంగా సర్వే చేసి హద్దు రాళ్లు పాతడంతో సమస్య పరిష్కారమైందని సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. ఇలా..ఈయన ఒక్కడే కాదు.. ప్రతి గ్రామంలో భూ సమస్యలు అనేకం ఉన్నాయి. గత ప్రభుత్వాలు వాటి జోలికి వెళ్లడానికి వెనకడుగు వేసి సమస్యలను జఠిలం చేశాయి. అయితే జగనన్న మాత్రం శాశ్వత పరిష్కారం చూపారు.

శాశ్వత పరిష్కారం దొరికింది



నాకు 5.54 ఎకరాల భూమి ఉంది. 50 సంవత్సరాల నుంచి హద్దుల సమస్యతో సతమతమవుతున్నాం. పలుమార్లు వాదనలు జరిగాయి. అయినా లాభం లేకపోయింది. అయితే ప్రస్తుతం ప్రభుత్వమే సర్వే చేసి హద్దులు నిర్ణయించి, ధ్రువ పత్రం అందజేశారు. అలాగే హద్దు రాళ్లు వారే ఏర్పాటు చేశారు. ఇందుకు ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదు. దీంతో మా సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికింది.

–సిద్దరెడ్డి, రైతు, వీరాలదిన్నె

ఎవరూ చేయని పని జగన్ చేశాడు



ఏ ప్రభుత్వం చేయని పనిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసి చూపించాడు. పొలాల హద్దులు చూపించి దానికి సంబంధించి రాళ్లు వేసి శాశ్వత పరిష్కారం చూపించారు. ఏ ప్రభుత్వాలు వచ్చినా భూ సమస్యలు కొనసాగుతూ వచ్చాయి. వాటిని తడుముకుంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని, రైతులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టారు. జగనన్న వచ్చి తమ హద్దుల సమస్యలకు పరిష్కారం చూపడం వల్ల సమస్యల నుంచి విముక్తి లభించింది.

– చిన్న అయ్యన్న, గోతులదొడ్డి

సమస్య తీరింది



నాకు గుర్రాలదొడ్డిలో 2ఎకరాల పొలం ఉంది. ఎన్నోఏళ్లుగా ఎదురు చూస్తున్నా సర్వేలో పూర్తిగా సమస్య పరిష్కారం కాలేదు. జగనన్న సర్వేతో నా సమస్య తీరింది. రైతులకు అన్ని విధాలుగా ఆదుకుంటున్నా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– రజ్మా, గుడికంబాలి

క్లుప్తంగా

28న వాహనాల వేలం


పట్టుబడిన వాహనాలు

ఆదోని రూరల్ : ఆదోని సెబ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 28వ తేదీన నంద్యాల ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్ ఆధ్వర్యంలో వేలం నిర్వహిస్తామని సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సెబ్ స్టేషన్ కార్యాలయ ఆవరణలో వేలం పాటలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు ఉదయమే స్టేషన్‌లో రూ.5 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. వివరాలకు స్థానిక సెబ్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

నీటి సరఫరా పరిశీలన

ఆదోనిటౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డు వెంకన్నపేటలో తాగునీటి సరఫరాపై మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, స్థానికులతో కలిసి బుధవారం పరిశీలించారు. పైపులైన్ లీకేజీలను అరికట్టడంలో వాటర్ వర్క్స్ సిబ్బంది విఫలమవుతున్నారనే ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. లీకేజీ ప్రాంతాన్ని గుర్తించి వెంటనే మరమ్మతులు చేసి నీరు వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. మురుగు కాలువలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయడం లేదని, వెంకన్నపేటలోనే నీటి సరఫరా అస్తవ్యస్తం, అపరిశుభ్రతపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు.

మూడు రోజుల్లో ఉపాధి వేతనం


మాట్లాడుతున్న ఏపీఓ జుబేర్

కౌతాళం: ఉపాధి కూలీలకు మూడు రోజుల్లోపు ఉపాధి వేతనం ఇస్తామని ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీఓ జుబేర్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయని 5,500 మంది ఉపాధి కూలీలకు గాను 4,300 మంది కూలీలు రోజు వారీగా పనులకు వస్తున్నారని తెలిపారు. ఉపాధి కూలీలకు రోజు వారి కూలి రూ. 271 వస్తుందని, కూలీలు వలసలు పోకుండా ఉపాధి పనులకు రావాలని కోరారు. ఈసీ ఖాదర్‌బాషా, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సచివాలయ సేవలు విస్తృతం చేయాలి

కౌతాళం: సచివాలయ సేవలను విస్తృతం చేయాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా సమస్యలకు వేగంగా పరిష్కారం చూపాలని చెప్పారు. కొందరు సిబ్బంది సాకులు చెబుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల నిరసన

ఆదోని అర్బన్ : మంగళి పని నాయీబ్రాహ్మణుల కుల వృత్తి అని, ఇతరులు ఏర్పాటు చేసుకున్న దుకాణాలను తొలగించాలని బుధవారం నాయీబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక మంగళ ఆంజనేయస్వామి నిరసన చేపట్టారు. సంఘం అధ్యక్షుడు గొడిఈరన్న, గౌరవాధ్యక్షుడు రంగస్వామి మాట్లాడారు. వేరే ప్రాంతాల నుంచి వ్యక్తులను తీసుకొచ్చి షాపులను నడిపించడం సబబు కాదన్నారు. ఇలాంటి చర్యల ద్వారా తమ మా కడుపులు కొట్టడమేనని, వీరి ద్వారా తాము ఉపాధిని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం ఉపాధ్యక్షుడు నాగరాజు, సెక్రటరీ ఈరన్న, జాయింట్ సెక్రటరీ గోవిందరాజులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

కర్నూలు(అర్బన్): నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. బుధవారం ఆమె జిల్లాలోని ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ ఇంజినీర్లతో గృహ నిర్మాణాల ప్రగతిపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి స్టేజ్ కన్వర్షన్, ఎక్స్‌పెండేచర్, బ్యాంక్ టైఅప్ పురోగతి వివరాలపై రోజువారి నివేదికలను తనకు అందించాలని హౌసింగ్ పీడీ వెంకటనారాయణను ఆదేశించారు. ఇంకా ప్రారంభంకానివి 1,320, బిలో బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్న 15,669 ఇళ్లను త్వరితగతిన బేస్‌మెంట్ లెవల్‌కు తీసుకురావాలన్నారు. ప్రతిరోజూ స్టేజ్ కన్వర్షన్ల సంఖ్య గణనీయంగా పెరగాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో వెనుకబడిన ఆదోని అర్బన్, హాలహర్వి, చిప్పగిరి, పెద్దకడుబూరు మండలాలకు సంబంధించిన అధికారులతో ఆమె ప్రత్యేకంగా సమీక్షించారు.

బాధ్యతలు స్వీకరించిన యార్డు చైర్మన్


మజర్‌అహ్మద్‌కు అభినందనలు తెలియజేస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్ : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా బండి మజర్ అహ్మద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం గత వారంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవులకు జీఓను విడుదల చేసి సభ్యులను ఎన్నుకున్నారు. మజర్‌అహ్మద్‌ను చైర్మన్‌గా నియమించి పాత పాలకమండలి సభ్యులు యథావిధిగా కొనసాగనున్నారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టిన మజర్‌అహ్మద్‌కు యార్డు సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ తిమ్మప్ప, కమీషన్ ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి బొకే అందజేసి స్వాగతం పలికారు. నూతన చైర్మన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పదవి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ఎండీ అన్ను, యార్డు డైరెక్టర్‌లు అనిల్‌కుమార్, విజయ్ పాల్గొన్నారు.

హస్త కళాకారులకు ఉపాధి కల్పించాలి


ఎమ్మెల్సీ మధుసూదన్‌ను కలిసిన విజయలక్ష్మి

ఆదోని అర్బన్ : హస్త కళాకారులు తయారు చేసిన బొమ్మలను కొనుగోలు చేసి హస్త కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర హస్త కళా అభివృద్ధి (లేపాక్షి) కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగింజల విజయలక్ష్మి కోరారు. జిల్లా పర్యటనలో భాగంగా ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌ను ఆయన నివాసంలో బుధవారం కలిశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బడిగింజల చంద్రమౌళి, కర్నూలు లేపాక్షి ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య, సిబ్బంది కిషోర్, వినయ్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. స్థానిక క్రాంతినగర్‌లో వెలిసిన చౌడేశ్వరిదేవిని దర్శించుకుని, ఆలయంలో తొగటవీర క్షత్రియ సంఘం సభ్యులకు సమావేశం నిర్వహించారు. సంఘం నాయకులు రామచంద్రప్ప, రాజగోపాల్, జ్ఞానప్ప, సుజాత, పంకజాక్షి పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తనీయొద్దు


మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు

పెద్దకడబూరు : వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతరం సచివాలయం –1ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలని, సచివాలయాల్లో ప్రతి బుధవారం స్పందన కార్యక్రమం ఏర్పాటు చేసి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలన్నారు. జగనన్న ఇంటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎంపీడీఓ వెంకటరమణప్ప, ఇన్‌చార్జ్ తహసీల్దారు వీరేంద్రగౌడ్ పాల్గొన్నారు.

అధిక ధరలకు విత్తనాలు అమ్మితే లైసెన్సులు రద్దు


పత్తి విత్తన ప్రాసెసింగ్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి

ఆదోని రూరల్ : అధిక ధరలకు విత్తనాలు అమ్మితే లైసెన్సులు రద్దు చేస్తాంమని జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి హెచ్చరించారు. బుధవారం మండలంలోని విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల విక్రయదారులకు వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ మీటింగ్ హాల్‌లో ఖరీఫ్–2023పై సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ రాబోయే సీజన్‌లో అన్ని రకాల విత్తనాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ముఖ్యంగా పత్తి, మిరప విత్తనాలు అన్ని రకాలు అందుబాటులో ఉంటాయని, విత్తనాలను బ్లాక్ మార్కెట్ తరలించడం గానీ బ్లాక్‌లో అమ్మడం గానీ చేస్తే డీలర్ల లైసెన్సులు రద్దు చేయడమే కాకుండా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన వెంటనే బిల్లులను అడిగి తీసుకోవాలని చెప్పారు. అనంతరం ఆమె అజాత అగ్రిటెక్‌లో పత్తి విత్తనాల ప్రాసెసింగ్, ప్యాకింగ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్యాలయ ఏఓ రఘు, ఆదోని ఏడీఏ ఎం.గిరీష్, ఏఓ పాపిరెడ్డి, కర్నూలు జిల్లా ఫర్టిలైజర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్.అశోక్, ఆనందరెడ్డి, పాడేగల్ మురళి, డీలర్లు పాల్గొన్నారు.

28 నుంచి ఇండియన్ డ్యాన్స్ ఫెస్ట్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: నృత్యజ్యోతి కళా సంస్థ 23వ వార్షికోత్సవం పురస్కరించుకొని కర్నూలులో ఈనెల 28వ తేదీ నుంచి మూడు రోజుల పాటు సౌత్ ఏషియా పీస్ కాన్ఫరెన్స్, ఇండియన్ డ్యాన్స్ ఫెస్ట్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సౌత్ ఏషియా ఫెటర్నిటీ యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు సత్యపాల్ వెల్లడించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే వేడుకల్లో వివిధ ప్రాంతాలకు చెందిన డ్యాన్స్ మాస్టర్లు, కళాకారులు పాల్గొని ప్రదర్శనలు ఇస్తారన్నారు. నృత్య జ్యోతి కళా సంస్థ కార్యదర్శి, డ్యాన్స్ మాస్టర్ డాక్టర్ కె.వి.భార్గవకుమార్ మాట్లాడుతూ నగర శివారులోని ఇండస్ పాఠశాల ఆవరణలో ఈనెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించే వేడుకల్లో మూడు దేశాలు, 15 రాష్ట్రాల నుంచి 175 మంది ఆర్టిస్టులు పాల్గొంటున్నారన్నారు. ఆర్ట్ గ్యాలరీ, స్పాట్ పెయింటింగ్, కార్టూన్ పెయింటింగ్, సాండ్ ఆర్ట్ ప్రదర్శనలు ఉంటాయన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులచే విభిన్న నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. డాక్టర్ పేరణి రవితేజ, షాహిద్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్ : పట్టణంలోని న్యూగాంధీ నగర్‌లో నివాసముంటున్న హరిజన అంజి అనే వ్యక్తి 96 కర్ణాటక ఓసీ డీలక్స్ విస్కీ ప్యాకెట్లు కలిగి ఉండగా.. అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఆదోని సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. మద్యం తరలిస్తున్నాడనే సమాచారం మేరకు.. బుధవారం తమ సిబ్బంది దాడి చేసి పట్టుకొని మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సెబ్ ఎస్ఐ మధుసూదనరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

30న సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు(టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 30న ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం కార్యదర్శి విజయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2006 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 26 నుంచి 28 వరకు నిర్వహించనున్న 10వ జూనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. వివరాలకు 70320 88008 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

టీడీపీ వర్గీయులపై కేసు నమోదు

కోసిగి: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళంలో భాగంగా కోసిగిలో నిర్వహించిన బహిరంగ సభ ముగిసిన వెంటనే తెలుగు తమ్ముళ్లు ఇరు వర్గాల కర్రలు, రాళ్లతో దాడులు చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో కోసిగి, చిన్నభూంపల్లి గ్రామాలకు చెందిన కార్యకర్తలు పరస్పర దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో చిన్నభూంపల్లికి చెందిన టీడీపీ మాజీ సర్పంచ్ మాధవరం నరసింహులుతో మరో ఏడుగురు, అలాగే కోసిగికి చెందిన జక్కనగేని నరసింహులతో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజా రెడ్డి తెలిపారు.

నాడు–నేడు పనుల్లో పురోగతి సాధించాలి

ఆలూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు కింద జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పురోగతి సాధించాలని మండల ప్రత్యేక అధికారి వెంకట నారాయణ సూచించారు. బుధవారం ఆయన పట్టణంలోని ఎంపీపీ మెయిన్, ఉర్దూ హైస్కూల్ గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. వేసవి సెలవులు పూర్తయ్యేలోపు పనులు పూర్తి చేయాలని ఎంఈఓ కోమలాదేవి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. అంతకుముందు ఎంపీడీఓ కార్యాలయ సమావేశం భవనంలో అధికారులతో సమావేశమయ్యారు. జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయం–2ను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. అన్ని రకాల సర్వీసులు ప్రజలకు అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ అల్లబకాష్, ఎంఈఓ కోమలా దేవి, ఈఓపీఆర్డీ ప్రకాష్ నాయుడు, విద్యుత్ ఏఈ లోకేష్, ఏపీఓ హేమసుందర్, హౌసింగ్ జేఈ జాఫర్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈలు చౌడా రెడ్డి, మోహన్ ఉన్నారు.

– జగనన్న లేఅవుట్లలో ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని హాలహర్వి మండల ప్రత్యేక అధికారి రామాంజనేయులు సూచించారు. బుధవారం ఆయన అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం గూళ్యం గ్రామంలో నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ మల్లికార్జున, ఎంపీడీఓ ఆంటోని ఉన్నారు.

అవినీతి అరికట్టి రుణాలు ఇప్పించండి

కౌతాళం: అవినీతిని అరికట్టి తమకు రుణాలు ఇప్పించాలని మండలంలోని కరణి గ్రామానికి చెందిన రత్న పొదుపు సంఘం మహిళలు కోరారు. బుధవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సీసీ వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందజేశారు. సంఘం సభ్యులు నాగలక్ష్మి, ఉరుకుందమ్మ, నర్సమ్మ, లక్ష్మి, తాయమ్మ తదితరులు మాట్లాడుతూ గత ఏడాది జనవరిలో సంఘం అప్పు మొత్తం రూ.62వేలు ఉండగా ఈ మొత్తంను బ్యాంకులో జమ చేయడానికి వస్తే అప్పుడు ఉన్న సీసీ హేమంత్‌కుమార్, వివో శ్రీరాములు రూ.40వేలు స్త్రీనిధి ఖాతాకు బదిలీ చేశారని, ఇంకా బ్యాంకులో రూ.22వేలు అప్పుగా చూపిస్తున్నారని, స్త్రీనిధి రుణం కోసం వెళ్తే బకాయి చెల్లించాలని చెబుతున్నారని వాపోయారు. విషయాన్ని సీసీ,వీవో దృష్టికి తీసుకెళ్లగా మీ డబ్బుల్ని స్త్రీనిధికి బదిలీ చేశామని, త్వరలోనే చెల్లిస్తామని చెప్పారన్నారు.

ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తికి గాయాలు

ఆదోని అర్బన్ : మండలంలోని ఆరేకల్‌లో కళాశాలలో నిర్మాణం చేపడుతుండగా కిందకు పడి ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. అవుట్ పోస్టు కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు.. ఆరేకల్ గ్రామంలో కళాశాల నిర్మాణం చేపడుతుండగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి పనిచేస్తూ ప్రమాదవశాత్తూ కింద పడి గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

పాము కాటుతో అస్వస్థత..
దొడ్డనగేరి గ్రామానికి చెందిన ఉరుకుంద పాముకాటుతో అస్వస్థతకు గురయ్యారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఉరుకుంద పొలం పనులకు వెళ్లగా, అక్కడ పాము కాటు వేయడంతో వెంటనే బంధువులు ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేయడంతో కోలుకున్నట్లు చెప్పారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట


సంతెకూడ్లూరులో మహిళకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్ : ప్రజా సంక్షేమానికే ప్రభుత్వం పెద్దపీట వేసిందని, రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. వేరే ప్రభుత్వం వస్తే సంక్షేమ పథకాలు ఎత్తివేస్తారని, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగన్‌ను సీఎంగా ఆశీర్వదించాలని ప్రజలకు తెలియజేశారు. సోమవారం మండలంలోని సంతెకూడ్లూరు గ్రామంలో మూడో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపను సందర్శించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీరు, డ్రెయినేజీ సమస్యలున్నాయని స్థానికులు ప్రస్తావించగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని, మరింత అభివృద్ధి చేసి చూపుతామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు మంజుల, రేణుక, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, మండల ఎంపీపీ బదాయి దానమ్మ, పంపాపతి, సర్పంచ్ ధనలక్ష్మి, ఎంపీటీసీ కనకమ్మ, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ గీతావాణి, ఆర్ఐ జయరామిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, పీఆర్ ఏఈ మాలిక్‌బాషా, ఏపీఓ చంద్రశేఖర్, వెలుగు ఏపీఎం జనార్దన్, పంచాయతీ అధికారులు, హౌసింగ్ బోర్డు అధికారి తిప్పన్న, వ్యవసాయశాఖ అధికారి పాపిరెడ్డి, వైఎస్సార్ మహిళా నాయకురాలు శ్రీలక్ష్మి, కల్పవల్లి, లక్ష్మి, నాయకులు ప్రతాపరెడ్డి, బ్రదర్స్ నాగరాజు, మధు, వీరభద్రప్ప, నకతే శ్యాం, వేణుగోపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వల్లభాయ్ తాత, శంకర్‌రెడ్డి, రవికుమార్, తిక్క హనుమంతప్ప, విక్రమ్, నారాయణ, దస్తగిరినాయుడు, చిన్నఈరన్న పాల్గొన్నారు.

పిడుగుపడి ఆవులు మృతి


హెచ్.మురవణిలో పిడుగుపాటుకు మృతి చెందిన ఆవులు

పెద్దకడబూరు : మండలంలో మంగళవారం అర్ధ రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉరుముల ధాటికి మండల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మండలంలో 33.4 ఎం.ఎం వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. హెచ్.మురవణి గ్రామానికి చెందిన జిలికి ఉశేని అనే రైతు తన ఆవులను ఎప్పటిలాగే.. మంగళవారం రాత్రి తన పొలంలో కట్టివేసి ఇంటికి వచ్చాడు. ఉదయం పొలానికి వెళ్లి చూడగా పిడుగు పడి రెండు ఆవులు మృతి చెందాయి. గాలి వర్షం ధాటికి మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ సిబ్బంది తక్షణమే మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు.

నెలకొరిగిన తాత్కాలిక షెడ్లు
మంత్రాలయం రూరల్: మంత్రాలయంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం ధాటికి శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం ముందు భాగంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లు నెలకొరిగాయి. వర్షం భారీగా కురవడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శ్రీ మఠం అధికారులు మఠం ఆవరణలోని బహిరంగ ప్రదేశంలో వసతి ఏర్పాటు చేశారు.


నెలకొరిగిన షెడ్లు

పొర్లు దండాలు పెట్టినా ప్రజలు నమ్మరు


గ్రామ దేవత పూజలో పాల్గొన్న మంత్రి జయరాం

- మంత్రి గుమ్మనూరు జయరాం

చిప్పగిరి: పాదయాత్ర చేసినా, పొర్లు దండాలు పెట్టినా నారా లోకేష్‌ను, టీడీపీని ప్రజలు నమ్మరని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. బుధవారం మంత్రి స్వగ్రామం గుమ్మనూరులో దేవరను పురస్కరించుకుని మారెమ్మ అవ్వకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఏమి చేస్తారో చెప్పకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడమే పనిగా లోకేష్ పాదయాత్ర సాగిస్తున్నారన్నారు. నవరత్నాల ద్వారా రాష్ట్రంలోని ప్రతి వర్గానికి మేలు జరిగిందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలన్నీ ప్రజల వద్దకే తెచ్చిన ఏకైక ముఖ్యమంత్రి మన జగనన్నే అన్నారు. 2024లో ఆయనే మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. మంత్రి వెంట దేవర గట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ ఉన్నారు.